ప్రజాశక్తి

సోమవారం 20 జనవరి 2025

5

పెరిగిన చలి తీవ్రత

- చింతపల్లిలో 7.3 డిగ్రీలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతంలో ఆదివారం సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. చింతపల్లిలో 7.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యిందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. 11 గంటలైనా వీడని పొగ మంచు కారణంగా వాహనదారులు ప్రయాణం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి నెలకొంది. చలి తీవ్రత కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై పొగ మంచు

అమిత్‌షా రాజీనామా చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన వెల్లువెత్తిన నిరసనలు

అరకులోయలో నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం అరకులోయ మండల కేంద్రంలోని సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, అంబేద్కర్‌ను అవమానిస్తూ హెూం మంత్రి అమిత్ షా పార్లమెంట్లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలన్నారు. హెూంమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. దీనిపై యావత్ భారతదేశం వ్యతిరేకించిందని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించక పోవడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ సంపదను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కిల్లో జగనాదం, కొర్రా మగ్గన్న, పాంగి బాలకృష్ణ, చిన్న, లైకోన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పై రాజ్యసభలో అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం పాడేరు మండలం బంగారమెట్ట గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు రాధాకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్.సుందరరావు, మాట్లాడుతూ, పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప మేధావి అంబేద్కర్‌ను ఎగతాళి చేస్తూ అమిత్ షా మాట్లాడడం బాధాకరమన్నారు.. అమిత్ షా వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నా ఆయనను ప్రధాని మోడీ వెనకేసుకు రావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చంటిబాబు, సిపిఎం నాయకులు రమేష్, బాలు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కూనవరం : అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఆంధ్రాలో అడుగుపెట్టే హక్కు లేదని, అమిత్‌షా గోబ్యాక్ అంటూ సిపిఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసనలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోజిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, సర్పంచ్ మడకం నాగమణి, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసరావు, పోడియం రామారావు,తెల్లం తమ్మయ్య,కూటురు సర్పంచ్ బొగ్గ వెంకమ్మ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూనవరంలో...

పాడేరులో..

విఆర్.పురంలో..

విఆర్.పురం: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ రేఖపల్లి జంక్షన్ వద్ద మానవహారం నిర్మించి అమిత్‌షా గో బ్యాక్ నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానకరంగా అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కోట్లాదిమంది భారతీయుల మనోభావాలను కించపర్చేలా అమిత్‌షా వాఖ్యలు చేసిన అమిత్‌షాకు రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హతే లేదని వెంటనే వెనుదిరిగిపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు వడ్లాది రమేష్, హజరత్, కె.కాంతారావు, కె. సత్యనారాయణ, తాతబాబు, పాండురాజు , తదితరులు పాల్గొన్నారు..

డెంగీ బాధిత చిన్నారి వైద్యానికి

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: డెంగీతో బాధపడుతూ, కాకినాడ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరేళ్ల గిరిజన చిన్నారి వైద్యానికి రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులు ఆర్థికసాయం అందించి, తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాలివి.

మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామ శివారులో నివాసం ఉంటున్న నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన ఆరేళ్ల గెమ్మెల మౌనిక డెంగీ వ్యాధితో బాధపడుతూ ఐదు రోజులుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందజేశారని బాలిక తల్లిదండ్రులు గెమ్మెల పెంటయ్య, రాధ తెలిపారు. బాలిక ఆరోగ్యపరిస్థితిపై తెలుగు యువత రంపచోడవరం నియోజకవర్గ అధ్యక్షులు ఎం విజయభాస్కర్ అక్కడి పార్టీనేతల ద్వారా తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, బాధితురాలి వైద్యానికి అవసరమైన సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. తమ బిడ్డ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, విజయభాస్కర్ దంపతులకు బాలిక మౌనిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మౌనిక

వాలీబాల్ టోర్నీ విజేత వేగితోట జట్టు

విజేతలకు బహుమతులిస్తున్న జెకెసిటి ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి - అల్లూరి జిల్లా : చింతూరు డివిజన్ కేంద్రంలోని సంతపాకల క్రీడామైదానంలో నిర్వహించిన జెకెసిటి వాలీబాల్ టోర్నీ విజేతగా వేగితోట జట్టు నిలిచింది. డివిజన్‌స్థాయి వాలీబాల్ టోర్నీలో 28జట్లు పాల్గొనగా, వేగితోట, చొప్పల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి.

ఆదివారం హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా జరిగిన ఫైనల్‌లో 25-23, 30-28 పాయింట్ల తేడాతో వరుసగా రెండుసెట్లలో విజయం సాధించిన వేగితోట జట్టు విజేతగా నిలవగా, చొప్పల్లి జట్లు రన్నరప్ స్థానానికి పరిమితమైంది. విజేత వేగితోట, రన్నరప్ చొప్పల్లి జట్లు క్రీడాకారులకు టోర్నీ నిర్వహణకు సహాయసహకారాలు అందించిన జెకెసి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ జమాల్‌ఖాన్ అభినందించి, ట్రోఫీతోపాటు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ, గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సాహించడంతోపాటు యువత చెడువ్యసనాలు, పెడదోవ పట్టకుండా ఉండేందుకు ఇటువంటి క్రీడాపోటీలు ఎంతగానో దోహదపడతాయనే ఉద్దేశ్యంతో వీటి నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను తమ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.

గిరిజనులకు రగ్గులు, చీరల పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గోందిగూడలో యుటిఎఫ్ సహకారంతో భీమిలి పట్నం కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ సౌజన్యంతో నిరుపేద గిరిజనులకు, వృద్ధులకు చీరలు, రగ్గులు, టవల్స్‌తో పాటు స్టీల్ బేసిన్స్, గ్లాసులు, స్టీల్ బాక్స్ లు ఉచితంగా పంపిణి చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ చైర్మన్ కే శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా ప్రతి ఏడాది ఈ రకంగా వివిధ మండలాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండి, చక్కటి జీవన విధానాన్ని అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పలు రకాల వాటిని పంపిణీ చేయడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సభ్యులు పైడిరాజు, వి రాంబాబు, స్థానిక మండల అధ్యక్షుడు ఎస్ బాలకృష్ణ , అల్లూరి జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు మహేశ్వరరావు, సహాధ్యక్షులు చిట్టిబాబు, కార్యదర్శిలు కన్నయ్య, బాబురావు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -పాడేరు : విశాఖ స్టీల్ ప్లాంటుకు అవసరమైన తక్షణ సాయంగా రూ.11,440 కోట్ల ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే దీన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పల నర్స డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమే నన్నారు. విశాఖస్టీల్ ప్లాంట్ నిలదొక్కు కోవాలంటే మరికొన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.విశాఖ ఉక్కును సెయిల్లో విలీనం చేసి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నది ప్రజల వాంఛని తెలిపారు. వెంటనే సెయిల్లో విలీనం చేయడంతో పెట్టుబడి, మార్కెట్, గనుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సెయిల్లో విలీనం జరిగే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చూడాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ స్థిరంగా లాభాలతో నడవాలంటే దానికి స్వంత గనులు సమకూర్చాలన్నారు. మిట్టల్ ఫ్యాక్టరీకి గనులు కేటాయించమని రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రాన్ని కోరారని, విశాఖ ఉక్కుకు ఎందుకు గనులు కేటాయించరన్న ప్రశ్న ప్రజలో ఉందన్నారు. గనులు కేటాయించకుండా సంక్షోభం నుంచి బయటపడటం కష్టం అని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసునని తెలిపారు.కేంద్రప్రభుత్వం తక్షణం గనులు కేటాయించే విధంగా ముఖ్యమంత్రి పలుకుబడిని ఉపయోగించాలని కోరారు.ప్యాకేజీ ప్రకటించడంతో పాటు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ప్రకటన చేయలేదన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఆంధ్రుల హృదయ స్పందనకు చిహ్నమని, ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం తన యావత్ పలుకుబడిని ఉపయోగించి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర క్యాబినెట్ ఉపసంహరించుకునే విధంగా చూడాలన్నారు. వలంటీర్ రిటైర్మెంట్ స్కీం ఉపసంహరింపచేయాలని, కాంట్రాక్టు వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అరకు ఉత్సవ్‌కు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సందర్శకులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చలిలి పేరుతో అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ మాట్లాడుతూ, ముందుగా వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. స్థానికంగా తాజంగి, లంబసింగి, వనజంగి, కొత్తపల్లి జలపాతాలు, చాపరాయి వంటి ప్రదేశాలతో కూడిన వీడియోలను అరకు ఉత్సవ్ ప్రమోషన్ క్యాంపైన్లో చూపించాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళారూపాలను రోజువారి కార్యక్రమాలను రూపొందించాలన్నారు. వారికి అవసరమైన వసతి, భోజన, రవాణా ఏర్పాట్లను చూడాలని తెలిపారు. అందుకు తగిన విధంగా కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతలను అప్పగించాలని సూచించారు. విశాఖపట్నం నుండి అరకు వచ్చి, వెళ్లే వారికి ట్రావెల్ ఆపరేటర్లతో మాట్లాడి సీట్లను బట్టి ఒక ధరను నిశ్చయించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆనరోరియం, వేదిక, బారికేడ్లు, రవాణా, వసతి, భోజనం వంటి సౌకర్యాల కల్పనకు బడ్జెట్ అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు ప్రోటోకాల్ ప్రకారం సిద్ధం చేయాలన్నారు. అరకు ఉత్సవంలో స్ట్రీట్ లైట్లు, వెల్కమ్ ఆర్చులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు తదితర అంశాలకు జీవీఎంసీ సహకారం తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, సిపిఓ ఎస్ఎస్ ఆర్ కె పట్నాయక్, క్యూరేటర్స్ శంకర్రావు, మురళి, అరకు తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి -సీలేరు: మారుమూల గిరిజన గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. జీకే విధి మండలం దుప్పిలి వాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామస్తులు ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటే విధంగా జరుపుకున్నారు.

బంధుమిత్రులతో కలిసి గ్రామస్తులు థింసా నృత్యాలను వేస్తూ సందడి చేశారు. సీలేరులో గిరిజన సంప్రదాయాలు, ఆచారాలను చాటి చెప్పే విధంగా పిల్లిగెడ్డ గ్రామస్తులు థింసా నృత్యాలు చేస్తూ అలరించారు. గిరిజనులు సంక్రాంతి సంబరాలు 20 తేదీతో ముగుస్తుండడంతో ముమ్మరంగా సంక్రాంతి సంబరాలు జరుపుకుంటూ ఎంతో అనుభూతిని పొందుతున్నారు.

సీలేరులో థింసా నృత్యాలు చేస్తున్న పిల్లిగెడ్డ గిరిజనులు

పెద రమణయ్యపేటకు తారురోడ్డు వేయాలి

ప్రజాశక్తి- దేవీపట్నం : మండలం ఇందుకూరు గ్రామ పంచాయితీ పెద రమణయ్య పేట గ్రామానికి తారురోడ్డు వేయాలని కోరుతూ ఆదివారం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో గిరిజనులు చేపట్టారు. పెద రమణయ్య పేట గ్రామంలో 36 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇందుకూరు పేట గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి వెళ్లాలంటే అర్ అండ్ ఆర్ కాలనీ కచ్చులూరు గ్రామం ఉంది. మైదాన ప్రాంతానికి వెళ్లేందుకు ఈ రోడ్డు ద్వారానే దగ్గరి మార్గం కావడంతో గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి తారురోడ్డు వేయాలని కోరారు. అలాగే అంగన్వాడీ భవనం, రక్షితతాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్, తెల్లం శేఖర్ ఆధ్వర్యంలో ఆందోళనలో మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు,కారం రామన్న దొర, కుండ్ల సాయిరాం రెడ్డి,తుర్రం ఆదినారాయణ దొర, కొమరం చెల్లనదొర ఈక అరవాలు దొర,కొమరం బాబురావు దొర,తుర్రం సూరన్న దొర,తుర్రం చిన్నబ్బాయి దొర,తుర్రం వెంకటలక్ష్మి,ఈక చిన్నాలమ్మ,ఈక చెల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పెద్ద రమణయ్య పేట గిరిజనులు

పాపికొండల విహారయాత్రకు

పోటెత్తిన పర్యాటకులు

- దేవీపట్నం నుంచి 15 బోట్లతో పయనం
- శని, ఆదివారాల్లో 2018 మంది సందర్శన
- బోట్ పాయింట్ వద్ద సౌకర్యాల లేమిపై పర్యాటకుల పెదవి విరుపు

ప్రజాశక్తి- దేవీపట్నం: సంక్రాంతి తర్వాత వచ్చిన శని, ఆదివారాలు, సెలవు దినాలు కావడంతో గోదావరి తీరంలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కళకళలాడాయి. దేవీపట్నం మండలంలోని గండి పోచమ్మ ఆలయ సమీపంలోని గోదావరి తీరంలో పర్యాటక బోట్లు సందడి చేశాయి... ఎన్నడూ లేని రీతిలో రెండు రోజులూ, రోజుకు 15 చొప్పున బోట్లు సందర్శకులతో పాపికొండలు తరలివెళ్లాయి. పాపికొండలు విహారయాత్ర కనువిందుగా, సందడిగా మారింది. అయితే సరైన వసతులు లేవని పర్యాటకులు పెదవివిరచడం కొసమెరుపు.

ఆదివారం దేవీపట్నం మండలం నుంచి పాపికొండలు విహార యాత్రకు 15 పర్యాటక బోట్లు గోదావరి నదిలో ప్రయాణించాయి. శనివారం 15బోట్లలో1034 మంది. అలాగే ఆదివారం కూడా 15బోట్లలో 984 మంది పర్యాటకులు పాపికొండలు, పేరంటాలపల్లిని చూడడానికి వెళ్లారు. ఇటీవల కాలంలో ఇంత భారీగా సందర్శకులు వెళ్లడం ఇదే మొదటిసారి అని అధికారులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం సమీపంలో బోట్ పాయింట్ పర్యాటకులతో నిండి పోయింది

ఎక్కడ చూసినా పర్యాటకుల సందడి. వాహనాల పార్కింగ్‌తో కళకళలాడింది. గోదావరి నదిలో 15 బోట్లు ఒకేసారి ప్రయాణించడం, పర్యాటకుల ఆటపాటలతో చాలా సందడిగా విహారయాత్ర సాగిందని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నదిలో ప్రయాణం సాఫీగా జరిగిందని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. పర్యాటక బోట్లలో ఉన్న ప్రతి ఒక్కరికి లైఫ్ జాకెట్లు ఇవ్వడంతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించామని అధికారులు అంటున్నారు.

అయితే బోట్ పాయింట్ సమీపంలో పర్యాటకులకు అవసరమైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారనే విమర్శలు ఎదురయ్యాయి. ఇక్కడ పర్యాటకులు కూర్చోవడానికి సరైన బెంచీలు, మరుగుదొడ్లు లేకపోవడం పట్ల పర్యాటకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాపికొండలు విహారయాత్రకు ఇంత భారీ స్థాయిలో పర్యాటకులు వస్తున్నప్పుడు కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం, పర్యాటక అధికారుల నిర్లక్ష్యం సరికాదని అంటున్నారు. పాపికొండలు విహారయాత్రకు వచ్చే మహిళలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని పలువురు పర్యాటకులు అధికారుల దృష్టికి తెచ్చారు. సంక్రాంతి సందర్భంగా గండి పోచమ్మ ఆలయం సందర్శనకు వచ్చే భక్తులతో ఆదివారం రద్దీ కనిపించింది.

గోదావరి నదిలో పాపికొండల విహారయాత్రకు పర్యాటకులతో వెళుతున్న బోట్లు

గండిపోచమ్మ ఆలయ పాయింట్ వద్ద పర్యాటక బోట్లు సందడి

మరమ్మతు పనులు చేపడుతున్న యువకులు

శ్రమదానంతో కల్వర్టు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పట్టం పంచాయతీ దాబవలస సమీపంలో ఉన్న బైరోడివలస, పట్టాం గ్రామస్తులు కలిసి శ్రమదానంతో కల్వర్టు రహదారి మరమ్మతులను ఆదివారం చేపట్టారు. కల్వర్టు మరమ్మతులకు గురై నిర్మాణానికి నోచుకోక పోవడంతో ప్రమాదాలకు నిలయం మారింది. వర్షాకాలం వస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారిపై కించుమండ వారపు సంతకు వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో మూడు మండలాల ప్రజలు ఇదే రహదారి మీదుగా వారపు సంతలకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేక పోవడంతో గ్రామస్తులందరూ కలిసి స్వచ్ఛందంగా కల్వర్టు రహదారి గుంతలను పూడ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బూత్ ఇన్చార్జి కొర్రా నూకరాజు, బాలన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఇంటర్న్‌షిప్ మేళా

ప్రజాశక్తి-పాడేరు: ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ కార్యక్రమం ద్వారా జిల్లాలోని యువతకు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలలో అవకాశాలు కల్పించడానికి ఈ నెల 20, 21 వ తేదీన జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఐటీడీఏ పాడేరు, వైటిసి రంపచోడవరం, ఐటీడీఏ చింతూరులలో ఇంటర్న్ షిప్ మేళాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పదవ తరగతి, పాలిటెక్నిక్, ఐటిఐ, బీఏ, బీఎస్సీ, బీఫార్మసీ, బీబీఏ వంటి డిగ్రీ పూర్తి చేసి 21 నుండి 24 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కింద నెలకు ఆయిదారు వేల రూపాయలు చెల్లిస్తూ ఏడాది పాటు ఇంటర్న్ షిప్ కల్పిస్తామని వివరించారు. ఈ సమయంలో బీమా సౌకర్యం, పీఎం జీవన్ జ్యోతి, బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన లాంటి సౌకర్యాలు అందిస్తున్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం కింద లబ్ది పొందడంచెందిన అభ్యర్థులు పైన తెలిపిన కార్యాలలో ధృవ పత్రాలతో హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు పూర్తి వివరాలకు పాడేరు ఫోన్: 9949927899, రంపచోడవరం 9398338105, చింతూరు:63054 52812 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ సంపద అయిన విశాఖ ఉక్కును ప్రాణాలొడ్డి అయినా కాపాడుకుందామని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ పిలుపు నిచ్చింది. తెలుగు ప్రజలను వంచన చేస్తూ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేసే కుట్రలో భాగంగా ఉక్కు పరిరక్షణ ప్యాకేజీ ప్రకటించారంటూ ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆదివారం పౌరగ్రంథాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ వి.రమణమూర్తి మాట్లాడుతూ, ప్యాకేజీ ఇచ్చిన వారు దాన్ని ప్లాంట్ అభివృద్ధికి వినియోగించాల నియమం పలు షరతులు పెట్టడం పూర్తిగా అన్యాయమన్నారు. కేవలం 0.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల కర్మాగారం లోని విశ్వేశ్వరయ్య స్టీల్ ప్లాంట్‌కు భేషరతుగా రూ.15000 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన కేంద్రం, 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల విశాఖ స్టీల్ ప్లాంటుకు పరదేసినట్లు విదల్చడం తగదన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు కేంద్ర నిర్ణయాలను వత్తాసు పలకడం క్షమార్హం కాదన్నారు. సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల పైబలుకు విలువ చేసే స్టీల్ ప్లాంటును కేవలం రూ.7,686 కోట్ల విలువ కట్టి ప్రయివేటుకు తెగనమ్మాలని చూడటం కేంద్రానికి తగదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటి నుండి ఒకరు ఒక సైనికునిలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శరత్, ఉక్కు పోరాట కమిటీ సభ్యుడు కనకారెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరావు, ముకికవాడల విశాఖ సంక్షేమ సంఘం నాయకుడు రవి, భీమ్‌సేన వెల్ఫేర్ నాయకుడు కె.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ కొంత్రాయిగుడ గ్రామంలో తాగు నీరు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మహిళలు, సిపిఎం నేతలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సంధర్బంగా సిపిఎం నేత సమార్డి బాబురావు, పెసా కార్యదర్శి కొర్రా దేవన్న మాట్లాడుతూ, కొత్రాయిగుడ గ్రామంలో రోజురోజుకి తాగు నీరు సమస్య తీవ్రంగా పెరుగుతుందని, దీంతో గుక్కెడు నీళ్ల దొరకడం కష్టంగా మారిందన్నారు. గతంలో అనేక సార్లు పోరాటాలు, ఆందోళనలు చేసిన ఫలితంగా బోరు మంజూరు అయ్యిందన్నారు. బోరు నుంచి కళాయి కనెక్షన్ ఇవ్వకుండా మధ్యలోనే వదిలేశారని అన్నారు. బోరు తవ్వి ఏడాది గడుస్తున్నా నేటికి మంచినీరు సమస్య పరిష్కారం చేయకపోవడం దారుణమన్నారు. నీటీ ఎద్దడి నివారణకు పాలకులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అన్నారు.సత్వరమే నీటి సమస్య పరిష్కారం చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొర్రా సుబ్బారావు, సమర్డి దాసు, సమర్డి చంప, సమర్డి కలిమ, పూర్ణిమ, నాగమణి, కిల్లో జయంతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మహిళలు, సిపిఎం నేతలు

గృహ లబ్ధిదారులకు రూ.5 లక్షలు చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ఆదివాసి గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న భగత, వాల్మీకి, మాలి, కొండ కుమ్మరి, కొట్టియా, కమ్మర, తదితర కులాల గిరిజనులకు గృహాల నిర్మాణాలకు ప్రభుత్వ నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, ఒక గృహానికి కనీసం ఐదు లక్షల నిధులు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యంత మారుల ఆ ప్రాంతంలో నివసిస్తున్న పివిటీజీలు జీవనాన్ని కొనసాగిస్తున్నా రన్నారు. కొండల్లో రహదారి లేని ప్రాంతంలో నివాసం ఉంటున్నారని, దానికి తోడు విపరీతంగా సిమెంట్, ఇసుక, కాంక్రీట్, స్టీల్ ధరలు పెరిగి పోవడంతో ప్రభుత్వం కేటాయించిన డబ్బులు గృహాల నిర్మాణానికి సరిపోలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పున:ఆలోచన చేసి ఆదివాసి పివి టి జి లకు కేటాయించిన గృహానికి రూ 5 లక్షల రూపాయలు కేటాయించాలనీ, ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్లో లబ్ధిదారులతో చలో ఐటిడీఏ కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ఎం.నర్సింగ్ పడాల్, ఎస్.గాసీ రామ్ దొర, ఎంఎం శ్రీను పాల్గొన్నారు.

జాతీయ పోటీల టెక్నికల్ ఆఫీసర్‌గా డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సూరత్‌లో జనవరి 19 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సీనియర్ నేషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ ఆఫీసర్‌గా ఎల్ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా పనిచేస్తున్న డివిఎస్‌వై.శర్మ ఎంపికయ్యారు. ఈయన ఇప్పటికే విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్ దాస్, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రెటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, సహోద్యోగులతో పాటు విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జెకె.నాయక్, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

వివేకానంద అడుగుజాడల్లో నడవాలి

ప్రజాశక్తి -పద్మనాభం : వివేకానంద అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సిఐ సిహెచ్.శ్రీధర్ కోరారు. నెహ్రూ యువ కేంద్ర, గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ సంయుక్తంగా పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్‌లో నిర్వహించిన వివేకానంద యువజనోత్సవాలు ఆదివారం ముగిశాయి. వివేకానంద చిత్రపటానికి సిఐ పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, వివేకానంద ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తన ఉండాలన్నారు. యువత దేశ సంపద అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగరవేసే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, తమటపు నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, పాలూరు కృష్ణారావు, మచ్చ సోమేష్, సిరిపురపు వెంకటరావు, కె.ఈశ్వరరావు, గౌరీరెడ్డి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: కారులో వెళుతున్న యువకులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... లంబసింగి పర్యాటక ప్రాంతం నుండి ఎస్.కోటకు చెందిన నలుగురు యువకులు కారులో ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఏమి కాక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ కోటకు చెందిన నలుగురు యువకులు ఆదివారం కారులో లంబసింగి వెళ్లి తిరిగి వస్తుండగా మున్సిపాల్టి నెల్లిమెట్ట సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు టౌన్ పోలీసులు పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని టౌన్ పోలీసులు తెలియజేశారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై ఆదివారం మినీ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అడ్డురోడ్ నుంచి తుని వెళుతున్న మినీ వ్యాన్ నక్కపల్లి ఇసుక ర్యాంపు ప్రాంతంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సిఐ కుమారస్వామి, ఎస్సై సన్నిబాబుల ఆధ్వర్యంలో బోల్తా పడిన వాహనాన్ని తీయించి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని లాలం కొత్తూరు గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరినీ అరెస్టు చేశామని సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆదివారం విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందికి కోడిపందేల స్థావరంపై దాడి చేశారు. రెండు కోడిపుంజులు, రూ.1150 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, సూర్యారావు పాల్గొన్నారు.

లంకెబిందెల పేరుతో మోసం

- పట్టుబడ్డ మోసగాళ్లు

ప్రజాశక్తి - ఆనందపురం : లంకెబిందెల పేరుతో మోసానికి పాల్పడి రూ.లక్షల్లో వసూలు చేసిన ఘరానా మోసగాళ్లు పట్టుబడ్డారు. ఆనందపురం మండలంలో లంకె బిందెలతో కోటీశ్వర్లు అయిపోతారంటూ నలుగురిని నమ్మించి వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. మంత్రించిన లంకె బిందెలను అందజేస్తామని కేటుగాళ్లు నమ్మించి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశారు.

మండలంలోని వేమగొట్టిపాలెం గ్రామానికి చెందిన కొండ్రోతూ అప్పలరాజు (26), మల్కాపురం ప్రాంతానికి చెందిన పైడిపాటి వెంకట భార్గవరావు అలియాస్ మునిస్వామి (35), గాజువాకకు చెందిన డేరింగ్ కృష్ణకుమార్ కలిసి మునిస్వామి వద్ద లంకె బిందెలున్నాయని నమ్మించారు. దీంతో ఆనందపురం మండలం బిపి కల్లాలకు చెందిన పలువురు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. పూజలు చేసి లంకె బిందెలు ఇస్తామని చెప్పినా ఇంతవరకు ఇవ్వకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. మునిస్వామికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆనందపురం -బోని రోడ్డులో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి పాత రాగి సామాన్లు, కారు, 1.70 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమయింది. గ్రామానికి చెందిన కొండ్ర సత్యవతి పూరింటిలో ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెల రేగడంతో ఇంట్లో ఉన్న సామాగ్రితో పాటు పూరిల్లు కాలిపోయింది. సామాగ్రి తో పాటు ఇల్లు అగ్నికి ఆహుతి అవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వెలిబుచ్చారు.

గుండాట ఆడుతున్న ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తీడ గ్రామ శివారులో గుండాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. పక్కా సమాచారం మేరకు తమ సిబ్బంది గుండాట ఆడుతున్న వారిపై దాడులు చేశారని, ఆరు గుళ్లు, ఒక నెంబరు పట్టాతోపాటు రూ.3210 నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మానికి లేని మోక్షం

- 9 వేలకు 777 ఎకరాలకు మాత్రమే పరికరాల అందజేత

- పురోగతిలేని సూక్ష్మ సాగునీటి పథకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సూక్ష్మ సేద్యానికి ఏ ప్రభుత్వంలోనూ మోక్షం లభించడంలేదు. విధించుకున్న లక్ష్యాల్లో కనిపించిన గొప్పతనం ఆచరణలో నీరుగారుతోంది. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 9 వేల ఎకరాల్లో బిందు, తుంపర సేద్యం అమలు చేయాలని లక్ష్యం నిర్ధేశించుకుని, 777 ఎకరాలకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను రైతులకు అందజేశారు.

జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటి సాగు పథకం (ఎపిఎంఐపి), ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన (పిఎంకెఎస్‌వై) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో రూ.17.95 కోట్ల వ్యయంతో 9 వేల ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అమలుచేయాలని భావించారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పథకం అమలు ఆశించిన స్థాయిలో జరగడంలేదు. వాస్తవానికి 8,142 ఎకరాల్లో సూక్ష్మ సేద్యం కోసం 3,168 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరిలో 3550 ఎకరాలకు సంబంధించిన 1454 మంది రైతులు దరఖాస్తులను ప్రాథమికంగా అధికారులు పరిశీలించారు. 559 మంది రైతులను అర్హులుగా గుర్తించి 1245 ఎకరాలకు పరికరాల సరఫరాకు పరిపాలనామోదం ఇచ్చారు. ఇక్కడ పరిపాలనామోదం లభించిన రైతులందరికీ సూక్ష్మ సేద్య పరికరాలు అందజేయలేదు. పరిపాలనామోదం వచ్చిన 559 మంది రైతుల్లో 351 మంది రైతులకు చెందిన 777 ఎకరాలకు మాత్రమే పరికరాలు అందజేసినట్లు ఆ శాఖల గణాంకాలు చెబుతున్నాయి.

తక్కువ నీటితో వ్యవసాయ, ఉద్యాన, ఇతర పంటలను సాగుచేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించడానికి రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వాలు సూక్ష్మ సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో పరికరాలు అందజేయకపోవడం శోచనీయం. పరికరాల అందజేతలో జరుగుతున్న జాప్యంతో రైతులు ఆసక్తి చూపడంలేదు.

ఎవరు అర్హులు

ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) కింద 90 శాతం రాయితీ, ఐదెకరాల నుంచి 12.5 ఎకరాల మధ్య భూమి వున్న రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను ప్రభుత్వం అందజేయనుంది. తుంపర సేద్యం (స్ప్రింక్లర్లు ఇరిగేషన్)కు ఐదెకరాల కంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 55 శాతం రాయితీ, ఐదెకరాలు పైబడిన రైతుకు 45 శాతం రాయితీపై ఎపిఎంఐపి సూక్ష్మ సేద్య పరికరాలను రైతులకు అందజేయనుంది.

ప్లాస్టిక్ నిషేధంలో సోషల్ మీడియా కృషి అభినందనీయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి చైతన్యవంతంతో సహకరిస్తూ ముందడుగు వేసిన సామాజిక మాధ్యమ ప్రభావశీలులు (సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్)అందించిన సామాజిక సహకారం అభినందనీయమని, అందరికీ స్ఫూర్తిదాయకమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన జివిఎంసి, వైజాగ్ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్, వైజాగ్ సిటీ పేజెస్ ఇన్స్టాకమ్యూనిటీ, మిలీనియం సాఫ్ట్‌వేర్స్ సొల్యూషన్స్ సంయుక్తంగా ఆర్కే బీచ్ సమీపంలో నిర్వహించిన ప్లాస్టిక్ ఫ్రీ వైజాగ్ కార్యక్రమానికి పుష్ప-2 చిత్రం నటి కుమారి పావని, జివిఎంసి అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులతో కలిగే నష్టాలను వివరించారు.

సమాచార చేరవేతలో..

మీడియాది బాధ్యతాయుత పాత్ర

జ్యుడిషియల్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కోర్టులు - మీడియా పరస్పర సహకారంతో, సమన్వయంతో పని చేయాల్సి ఉందని, జవాబుదారీతనంతో కూడిన పనితీరును ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు పేర్కొన్నారు. 'జ్యుడీషియరీ అండ్ మీడియా' అనే అంశంపై జరిగిన మేధోపరమైన చర్చలో పలు అంశాలపై వారివారి ఆలోచనలను పంచుకున్నారు. ట్రయిల్ కోర్టులో, ఇతర న్యాయపరమైన అంశాల్లో మీడియా పాత్ర ఎలా ఉండాలి, దాని పరిధి, పరిమితులపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో జరిగిన సంఘటలను సోదాహరణంగా వివరించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భావితర జడ్జిలు ఎలా వ్యవహరించాలి అనే కోణంలో విశ్లేషణ చేశారు. పలు అంశాలపై సీనియర్ న్యాయమూర్తులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ హాలులో తలపెట్టిన సౌత్ జోన్ - 2 జ్యుడిషియల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన ఆదివారం 'జ్యుడీషియరీ అండ్ మీడియా, అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ త్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్' అనే అంశాలపై చర్చ నిర్వహించారు. ముందుగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన కోర్టులు - మీడియా పాత్ర అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. పీపీటీ ద్వారా పలు అంశాలపై వివరణ ఇచ్చారు. అనంతరం అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్‌పై జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన చర్చ జరగ్గా.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎఎం.ముస్తాక్యు, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఎఐ విధానాలను వివరించారు.

ప్రాంతీయ సదస్సులో భాగంగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని అన్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రాచుర్యం సంపాదించుకున్న మీడియాలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పని చేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కొల్‌కతాలో జరిగిన ఆర్జీకర్ ఆసుపత్రి ఘటన, ఇతర ఘటనల్లో మీడియా వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియాకున్న పరిమితుల గురించి ఇరు గ్రూపులూ తెలుసుకోవాల్సి ఉందని చెప్పారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషణ చేశారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి ఎ.ఎం. ముస్తాక్యు బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి మాట్లాడారు.

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జస్టిస్ కురియన్ జోసెఫ్, ముస్తాక్యు

కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఎఐ టెక్నాలజీ గురించి పీపీటీ ద్వారా వివరించారు. ఈ - కోర్టు రూముల గురించి, సాంకేతిక సిబ్బంది సహకారం గురించి తెలిపారు. కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఎఐ, గూగల్ నోట్ బుక్ సాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులు, హైకోర్టు, జిల్లా కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా భూగర్భ నీటి వనరులు

'ప్రజాశక్తి'తో జిల్లా భూగర్భ జల వనరుల అధికారి జి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ నీటి వనరులు ఆశాజనకంగా ఉన్నట్టు అనకాపల్లి జిల్లా భూగర్భ జలవనరుల అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో జల వనరుల లభ్యత, వినియోగం తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో భూగర్భ జలవనరుల లభ్యత ఎలా ఉంది ?

జిల్లాలో ప్రతి మండలంలో గత ఏడాది కంటే భూగర్భ జల వనరుల శాతం పెరిగింది. జిల్లాలో సాధారణ వర్షపాతం 2023 - 24లో 17.8 మిల్లీమీటర్లు తక్కువ ఉంది. అయితే, 2024 డిసెంబర్ 26 నాటికి సాధారణ వర్షపాతం 987.38 మిల్లీమీటర్లకుగాను 1163.02 మిల్లీమీటర్లు కురిసింది.

జిల్లాలో భూగర్భ జలాలు ఏ ప్రాంతంలో అడుగంటాయి ? ఏ ప్రాంతంలో పైకి ఉన్నాయి ?

దేవరాపల్లి మండలం తామరబ్బ గ్రామంలో 21.26 మీటర్లు లోతున నీటిమట్టం ఉండగా, కశింకోట మండలం ఎఎస్.పేటలో 0.17 మీటర్లలో నీటి లభ్యత ఉంది. మూడు మీటర్ల కంటే తక్కువ నీటి లభ్యత ఎనిమిది మండలాల్లోని 41 గ్రామాల్లోనూ, మూడు నుంచి ఎనిమిది మీటర్ల నీటి లభ్యత 13 మండలాల్లోనూ, 8 నుంచి 20 మీటర్ల నీటి లభ్యత మూడు మండలాల్లోని ఎనిమిది గ్రామాల్లోనూ, 20 మీటర్ల కంటే లోతుగా దేవరాపల్లి మండలం తామరబ్బలోనూ ఉంది.

భూగర్భ జలాలు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎపిఐఐఎటి ప్రాజెక్టు ద్వారా చెరువుల కింద ఆయకట్టు రైతులకు క్రాప్ వాటర్ బడ్జెట్‌పై అవగాహన కల్పిస్తున్నాం. రబీ తర్వాత మిగిలిన భూగర్భ జలాలతో ఏయే పంటలు వేసుకోవచ్చో వివరిస్తున్నాం. ప్రధానంగా రైతులు వాణిజ్య పంటలైన చెరుకు, ఇతర పంటలకు బదులు తక్కువ నీటిని వినియోగించి ఎక్కువ ఆదాయం పొందే చిరుధాన్యాలు వంటి పంటలు, ఉద్యానవన పంటల వైపు వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నాం

మహాధర్నాలో మాట్లాడుతున్న లోకనాథం

'ఉక్కు'పై సిపిఎం మహాధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని రద్దు చేయాలని, కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయిస్తూ ప్రధాని మోడీ ప్రకటన చేసేలా చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహాధర్నా చేపట్టారు. దీనికి విశేష స్పందన లభించింది. కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజానాట్య మండలి కళాకారులు స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై గీతాలను ఆలపించారు.

మహాధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీకే పరిమితం కాకుండా ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీ ప్లాంటుకు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో అశేష త్యాగాలతో విశాఖ ఉక్కు సాధించబడిందని, అదే పోరాట స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో రక్షించుకునేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయిందని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటిస్తున్నారుగానీ ప్రధాని మోడీ చేత ఆ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కన్నా కార్పొరేట్ల ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు తమ దోపిడీ కొనసాగడానికి ఎటువంటి ఆందోళనలూ లేని ప్రశాంత వాతావరణం కావాలని, విశాఖ ఉక్కుకు ప్యాకేజీ మాత్రమే ప్రకటించి, కార్మిక, ప్రజా పోరాటాన్ని శాంతింపజేసి, నక్కపల్లి ప్రాంతంలో మిట్టల్ ప్లాంట్ ఏర్పాటు అయ్యాక విశాఖ ఉక్కును కబలిస్తారని తెలిపారు. ఈ కుట్రల పట్ల విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం ప్లాంట్ మెడ మీద కత్తిలా వేలాడుతోందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని ప్రధాని, దేశంలో నెంబర్ వన్ స్థానంలోకి తీసుకువస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారని, వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్లాంటులో ఉత్పత్తి కారకులైన కార్మికులకు వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులను, కార్మికులను వేలాదిగా తగ్గించేస్తూ ప్లాంట్‌లో పూర్తి ఉత్పత్తి ఎలా సాధించగలరని ప్రశ్నించారు. మెడికల్ చెకప్, టెండర్లలో 30 శాతం కార్మికుల తగ్గింపు పేరుతో వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకుంటున్నారన్నారు. విఆర్ఎస్‌ను, అక్రమ తొలగింపులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులు 8,500 మంది ఇప్పటికీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వారికి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు సంవత్సరాల క్రితం ఉద్యమం ప్రారంభమైందని, ఇప్పటికీ ఈ డిమాండ్ నెరవేరలేదని, ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయం రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు మోడీ ప్రభుత్వంతో ఉక్కు పరిరక్షణ ప్రకటన చేయించి సంబరాలు జరిపితే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, జె.అయోధ్యరాం, వైటి.దాస్ పాల్గొన్నారు.